ఆగిన పనులు.. తప్పని అవస్థలు!

- అర్ధంతరంగా నిలిచిన సచివాలయ భవన నిర్మాణాలు
- కొన్ని చోట్ల పనులు పూర్తయినా ప్రారంభించని వైనం
- రూ.లక్షల ప్రభుత్వ ధనం వృథా
- ఇరుకు గదుల్లో ఇబ్బంది పడుతున్న సచివాలయ సిబ్బంది



కనగానపల్లిలో ఆగిన గ్రామ సచివాలయ భవన నిర్మాణం



రామగిరి మండలం ఎంసీపల్లిలో ప్రారంభానికి నోచుకోని భవనం

కనగానపల్లి: గ్రామ సచివాలయాల నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోవడం, పూర్తయిన భవనాలు ప్రారంభించకపోవడంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు రూ.కోట్ల ప్రజాధనం వృథాగా మారుతోంది. మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపన కోసం గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసింది. ప్రతి సచివాలయ భవనానికి రూ. 40 లక్షల నిధులు కేటాయించారు. దీంతో గత ప్రభుత్వ హయాంలోనే 70 శాతం పైగా భవన నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాతా ఈ సచివాలయ భవన నిర్మాణాలు పూర్తిగా ఆపేశారు. కొన్నిచోట్ల నిర్మాణాలు పూర్తైన వాటిని కూడా వినియోగం తీసుకోకుండా నిరుపయోగంగా ఉంచారు. దీంతో రూ. కోట్లు వెచ్చించిన భవన నిర్మాణాలు వృథాగా ఉన్నాయి.

ముందుకు సాగని నిర్మాణాలు

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాతా రాప్తాడు నియోజకవర్గంలో అన్నిచోట్ల సచివాలయ భవన నిర్మాణాలు ఆగిపోయాయి. నియోజక వర్గంలోని ఆరు మండలాల్లో 78 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలోనే వీటన్నింటికి పక్కా భవనాలు మంజూరు చేయడంతోపాటు 44 భవనాలు పూర్తి చేశారు. ఇందులో 29 భవనాలను కూడా ప్రారంభించారు. తర్వాతా ఎన్నికల కోడ్ రావటంతో కొన్నింటిని ప్రారంభించలేదు. మిగిలిన 34 భవనాలు నిర్మాణాలు దశలో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతా ఈ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయకపోవటంతో నిర్మాణాలన్ని ఆగిపోయాయి.. దీంతో గ్రామాల్లో చాలా చోట్ల మొండి గోడలు దర్శనమిస్తున్నాయి. ఇక రామగిరి, రాప్తాడు, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో పలుచోట్ల భవన నిర్మాణాలు పూర్తి చేసినా ప్రజాప్రతినిధులు వాటిని ప్రారంభించకపోవటంతో అధికారులు వాటిని వినియోగించుకోవటం లేదు.

సిబ్బందికి తప్పని ఇక్కట్లు

నియోజకవర్గంలోని రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో చాలా చోట్ల గ్రామ సచివాలయ భవనాలు లేకపోవటంతో పాత పంచాయతీ భవనాలు, కమ్యూనిటీ భవనాల్లో వీటిని నిర్వహిస్తున్నారు. 10 మంది పైగా ఉద్యోగులు ఉండే సచివాలయాల్లో ఇరుకుగా ఉన్న గదుల్లో విధులు నిర్వహించాలంటే సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కేవలం రాజకీయ దురుద్దేశంతో అధికార పార్టీ నాయకులు రామగిరి, కనగానపల్లి మండలాల్లో కొన్నిచోట్ల ఈ భవనాలను అధికారులను వినియోగించుకోనీయడం లేదని స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు ఆరోపిస్తున్నారు.

సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం



ప్రజలకు స్థానిక స్వపరి పాలనను అందించాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. అయితే కూటమి ప్రభుత్వ ఏర్పడిన తర్వాతా దీనిని నిర్వీర్యం చేయాలని చూస్తున్నారు. దీంతో కనగానపల్లి మండలంలో చాలా చోట్ల సచివాలయ భవన నిర్మాణాలు ఆపేశారు. మండల కేంద్రంలోని భవన నిర్మాణం ఆగిపోయింది.

– దాసరి ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నాయకుడు, కనగానపల్లి

భవనాన్ని వినియోగించుకోలేదు



మా గ్రామంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే సచివాలయ భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ రావటంతో అప్పట్లో ప్రారంభోత్సవాన్ని ఆపేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాజకీయ దురుద్దేశంతో దీనిని వినియోగించటం లేదు. దీంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన సచివాలయ భవనం వృథాగా ఉంది. ఇరుకుగా ఉన్న ఆరోగ్య కేంద్రంలో సచివాలయాన్ని నిర్వహించలేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

– సిద్దప్ప, సర్పంచ్, ఎంసీ పల్లి, రామగిరి మండలం

నిర్మాణ పనులు కొనసాగించాలి

సచివాలయ భవనాల్లో 80 శాతం పనులు పూర్తయిన వాటి నిర్మాణాలను కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశించింది. మిగిలిన వాటిని ఆపేయాలని చెప్పింది. 20 శాతం పనులు కూడా జరగని వాటిని రద్దు చేయాలని చెప్పారు. దీంతో భవనాలు నిర్మాణాలు ముందుకు సాగటం లేదు. ఇక భవన నిర్మాణాలు పూర్తయిన వాటిని వినియోగించుకోవాలని స్థానిక అధికారులకు చెప్పాం.

– లక్ష్మీరాయణ, పంచాయతీరాజ్ డీఈఈ

సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ క్రిష్టయ్య

ధర్మవరం రూరల్: సేంద్రియ ఎరువుల వాడకంతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏడీఏ క్రిష్టయ్య రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఆకుతోటపల్లి, ధర్మపురి గ్రామాల్లో సహకార మిత్ర సంస్థ (సీసీడీ) ఆధ్వర్యంలో రైతు క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఏడీఏ క్రిష్టయ్య, ఏఓ ముస్తఫా, ప్రాజెక్ట్ మేనేజర్ నాగరాజు హాజరై మాట్లాడారు. సంస్థ రైతులకు ఇచ్చిన సేంద్రియ ఎరువులు, కషాయాలు వేరుశనగ పంటలో వాడడం వల్ల మంచి దిగుబడులు పెరిగాయన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సంస్థ అందించిన సేంద్రియ ఎరువులు, కషాయాల వాడకంతో పాటు సంస్థ ఉద్యోగులు నిర్వహించిన పొలంబడులు, వారు అందించిన సలహాలు, సూచనల కారణంగా గత ఏడాదికంటే ఈసారి రూ.7 వేల దాకా ఖర్చులు తగ్గాయని పేర్కొన్నారు. ఎకరాకు 27 బస్తాల దాకా దిగుబడులు వచ్చాయన్నారు. సేంద్రియ ఎరువులతో పండించిన పంటలకు మార్కెట్‌లో లభించే గిట్టుబాటు ధరల గురించి ఏడీ వివరించారు. రబీ సీజన్‌లో సేంద్రియ ఎరువుల ద్వారా పంటలను సాగు చేసుకునే రైతులు ముందుకు వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సంస్థ సభ్యులు కోరారు. కార్యక్రమంలో సంస్థ టీఏలు రవి, నారాయణస్వామి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ పథకాలు సద్వినియోగం చేసుకోండి



ప్రమాద బీమా చెక్కును అందజేస్తున్న బ్యాంకు అధికారులు

పుట్టపర్తి అర్బన్: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఖాతాదారులు తప్పకుండా ఇన్సూరెన్స్ సౌకర్యం పొందాలని, ఏదైనా అనుకోని సంఘటనలో ఖాతాదారులు మృతి చెందితే ప్రమాద బీమా వారి కుటుంబానికి ఆసరాగా నిలుస్తుందని పెడపల్లి ఏపీజీబీ మేనేజర్ సుభాషిణి పేర్కొన్నారు. మంగళవారం పైపల్లిలో పైపల్లి, గువ్వలగుట్టపల్లి, బత్తలపల్లి గ్రామాల ప్రజలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన ఖాతాదారు అలివేలమ్మకు వచ్చిన బీమా మొత్తం రూ.2 లక్షల చెక్కును భర్త చిదంబరప్పకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడూ ఏడాదికి రూ.436 చెల్లించి ఇన్సూరెన్స్ పొందాలన్నారు. ఇది ప్రధానమంత్రి జీవన జ్యోతి పథకంలో భాగమేనన్నారు. ఇలాంటి ఎన్నో ఇన్సూరెన్స్ పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు రమణ, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి



పుట్టపర్తిలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

పుట్టపర్తి టౌన్: జిల్లాలోని అన్ని మండలాలనూ కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం పుట్టపర్తిలోని గణేష్ కూడలిలో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 32 మండలాల్లోనూ కరవు విలయతాండవం చేస్తుంటే ప్రభుత్వం మాత్రం కొన్ని మండలాలనే కరువు జాబితాలో చేర్చడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వర్షాభావ పరిస్థితులతో అరకొరగా సాగైన వేరుశనగ ఎండిపోయిందని, మరికొన్ని పంటలు తుపాను ప్రభావంతో పూర్తిగా తడిచి దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటివి ఇవ్వకుండా ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని మండిపడ్డారు. సోమవారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కూటమి పార్టీల నాయకుల్లో విభేదాలు తొలగించేందుకు వచ్చారే తప్ప జిల్లాకు ఎటువంటి సాయమూ చేయలేదన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, నియోజకవర్గ కార్యదర్శి అంజనేయులు, రైతు సంఘం కార్యదర్శి మహదేవ్, నాయకులు మహేంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరమణ, పవన్, జాన్సన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్

కదిరి టౌన్: ప్రజా సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. 4వ వార్డులో 14వ ఫైనాన్స్ ప్రణాళిక ప్రకారం పైప్‌లైన్ కోసం రూ.13 లక్షలు ఖర్చు చేసినట్లు చూపారని, వాస్తవానికి పనులు చేయకుండా బిల్లులు డ్రా చేశారని కౌన్సిలర్ లింగాల కృపాకర్‌రెడ్డి ఆరోపించారు. అలాగే సైదాపురం సమీపంలోనూ 6 సెంట్లు, బాలుర కాలేజ్ గ్రౌండ్ సమీపంలో 10 సెంట్ల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. 22వ వార్డులో చెత్తా చెదారంతో కాలువలు నిండిపోయినా అధికారులు పట్టించుకోలేదన్నారు. 36 వార్డులకు 140 మంది మున్సిపల్ వర్కర్లు ఉన్నారని కమిషనర్ తెలిపారు. పట్టణంలో ఎక్కడా చెత్తాచెదారం లేకుండా, కాలువలో పూడిక తీయిస్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. హోటళ్లలో నాణ్యమైన ఆహారం అందించడం లేదని ఏడో వార్డు కౌన్సిలర్ కిన్నెర కళ్యాణ్ సమావేశం దృష్టికి తెచ్చారు. కూరగాయల మార్కెట్‌తో పాటు హోటళ్లు పరిశీలించి నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించే విధంగా చూడాలని కోరారు. శానిటేషన్ వర్కర్ రామ్మోహన్‌రెడ్డి డీజిల్‌లో అక్రమాలకు పాల్పడినందున సస్పెండ్ చేయాలని కౌన్సిలర్లు ముక్తకంఠంతో నినదించడంతో కమిషనర్ స్పందించి అతన్ని తొలగిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు అంజుకుంట రాజశేఖర్‌రెడ్డి, గంగాదేవి, కౌన్సిలర్లు, సీఐ నారాయణరెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దోమల నివారణ చర్యలు చేపట్టండి

బత్తలపల్లి: గ్రామాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టాలని ధర్మవరం సబ్ యూనిట్ ఆఫీసర్ జయరాం నాయక్ సూచించారు. మంగళవారం సంజీవపురంలో ఆయన సీహెచ్‌ఓ రాజశేఖర్‌తో కలిసి పర్యటించారు. గ్రామంలో దోమలు పెరుగుటకు అనువైన, చాలా రోజులు నీరు నిల్వ ఉన్నచోట దాదాపు 15వేల గంభూషియా చేప పిల్లలను వదిలారు. దోమ పుట్టకూడదు, దోమ కుట్టకూడదు అని వారు నినదించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ తిరుపాల్‌నాయక్, ఏఎన్‌ఎం శ్రీలత పాల్గొన్నారు.

నేడు గ్రామ సభలు

తాడిమర్రి: ప్రభుత్వం తాడిమర్రిని కరువు మండలంగా గుర్తించిన నేపథ్యంలో పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు బుధవారం అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరంగారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ సభల ద్వారా ఉపాధి పథకం కింద నీటి సంరక్షణ పనులను గుర్తించనున్నట్లు చెప్పారు.

నేటి నుంచి విగ్రహప్రతిష్ట కార్యక్రమాలు

తలుపుల : మండలంలోని ఓబుళేశ్వరుని కొండపై వెలిసిన ఓబుళేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు బుధవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు స్వామి కాపులు, భక్తులు తెలిపారు. తొలిరోజు అఖండ దీపారాధన, గంగపూజ, గణపతి పూజాకార్యక్రమాలు, గురువారం నవగ్రహ స్థాపన, నవగ్రహపూజ, కలశస్థాపన, అంకురార్పణ, గణపతి, నవగ్రహ హోమం, సాయంత్రం ఆదివాసాలు, హోమాలు, శుక్రవారం ఉదయం 8 గంటలకు విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పూజారి గుజ్జు శ్రీనివాస్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి వినతి

కదిరి అర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని ఏపీ ప్రజా రవాణా శాఖ జై భీమ్ అసోసియేషన్ నాయకులు మంగళవారం కదిరి ఆర్టీసీ డీఎం మైనోద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎన్నో ఏళ్లుగా డిపోలో పలురకాల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో రీజనల్ నాయకులు ఆర్‌జీ నాయక్, డిపో అధ్యక్షులు గంగరాజు, డిపో సెక్రటరీ గంగాద్రి, ఉపాధ్యక్షులు గోవిందప్ప, రవినాయక్,రమణప్పతో పాటు పలువురు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ విజేతలకు అభినందన



విజేత జట్టును అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కదిరి అర్బన్: శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల టేబుల్ టెన్నిస్ పోటీల్లో కదిరి ఎస్టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ నెల 4న గుంతకల్లు ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాలలో ఈ పోటీలు జరిగాయి. మంగళవారం విన్నర్స్ జట్టు విద్యార్థినులు శ్రావణి, సల్మా, సింధూను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత, పీడీ నరసింహాచారి, అధ్యాపకులు అభినందించారు.

క్రీడా పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

తలుపుల : ఓబులరెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు అనంతపురం ఆర్డీటీ క్రీడా మైదానంలో సోమవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు స్వర్ణలత తెలిపారు. వీరిలో అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థి సమీన, శివశంకర్, అండర్ -17 బేస్‌బాల్‌లో పదో తరగతి విద్యార్థి బాబాఫక్రుద్దీన్, అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో తన్వీ, చైతన్య, గిరివర్ధన్, ఎంపికయ్యారు. వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.



గౌతమ్



విష్ణు



జ్యోతిక

ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థులు

బత్తలపల్లి: కబడ్డీ రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు బత్తలపల్లి మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు దేవరకొండ మాధవి, వ్యాయామ ఉపాధ్యాయుడు మల్లికార్జున తెలిపారు. మంగళవారం వారు గురుకుల పాఠశాలలో విలేకర్లతో మాట్లాడుతూ పదో తరగతి చదువుతున్న ఎ.విష్ణు ఉమ్మడి అనంతపురం జిల్లా తరఫున ఎస్‌జీఎఫ్ అండర్-17 కబడ్డీలో గెలుపొంది జాతీయ స్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు. ఏడో తరగతి చదువుతున్న గౌతమ్ ఉమ్మడి అనంతపురం జిల్లా తరఫున ఎస్‌జీఎఫ్ అండర్-14 కబడ్డీలో గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

అండర్-14 కబడ్డీ జిల్లా జట్టుకు జ్యోతిక

ఎన్పీకుంట: టి.ఎస్.పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎ.జ్యోతిక అండర్-14 కబడ్డీ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మురళీక్రిష్ణ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు జ్యోతికను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ సోమవారం అనంతపురం జిల్లా కేంద్రంలోని ఆర్డీటీ క్రీడా ప్రాంగణంలో జరిగిన కబడ్డీ పోటీలలో జ్యోతిక అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జిల్లా జట్టులో స్థానం పొందిందన్నారు. ఈ నెల 9 నుంచి బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జ్యోతిక పాల్గొంటుందని తెలిపారు.

క్లుప్తంగా

విధుల్లో చేరిన డీఎంఓ



కలెక్టర్ చేతన్‌ను కలిసిన డీఎంఓ ఓబులు

పుట్టపర్తి అర్బన్: బదిలీపై వచ్చిన జిల్లా మలేరియా అధికారి (డీఎంఓ) ఓబులు మంగళవారం విధుల్లో చేరారు. అనంతరం కలెక్టర్ చేతన్, డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణిలను మర్యాద పూర్వకంగా కలిశారు. విధుల్లో చేరిన అనంతరం ఎనుములపల్లి పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం గంబూషియా చేపలను పుట్టపర్తి పట్టణంలోని మురుగు గుంతల్లో వదిలారు.

పది పరీక్ష ఫీజు గడువు పెంపుపై హర్షం

బత్తలపల్లి: పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లింపు గడువును ఎస్ఎస్‌సీ బోర్డు పెంచడం పట్ల ప్రైవేట్ పాఠశాలల సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం విజయవాడలో ఎస్ఎస్‌సీ బోర్డు డైరెక్టర్ దేవానందరెడ్డిని ఉమ్మడి అనంతపురం జిల్లాల ప్రైవేట్ పాఠశాలల సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం నూతనంగా చేపట్టిన విద్యార్థుల అపార్ వివరాల నమోదులో ఎదురవుతున్న సమస్యల గురించి బోర్డు డైరెక్టర్‌కు వివరించారు. త్వరలోనే అపార్ నమోదుకు సంబంధించి ఎడిట్ ఆప్షన్ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ తెలిపారన్నారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో సీఆర్ఓ రవిచంద్రారెడ్డి, జాయింట్ సెక్రటరీ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

మద్యం షాపుల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

ఓడీచెరువు : ప్రభుత్వ నిబంధనల మేరకే మద్యం షాపులు నిర్వహించాలని ఎక్సైజ్ సీఐ మారుతిరావు పేర్కొన్నారు. ఓడీచెరువులో ఓ మద్యం షాపును ప్రభుత్వ పాఠశాలకు దగ్గరలో ఏర్పాటు చేశారని వచ్చిన పిర్యాదు మేరకు కొలతలు వేసి అది నిజమేనని తేల్చినట్లు తెలిపారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. బడి, గుడికి దగ్గరలో మద్యం దుకాణాలు నిర్వహించరాదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

హంద్రీ-నీవా నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి అర్బన్: పట్నం సమీపంలోని అక్విడెక్ట్ వద్ద మంగళవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గేట్లు ఎత్తి హంద్రీ-నీవా నీటిని తలుపుల, ఎన్పీకుంట మండలాలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే గాండ్లపెంట మండలానికి కూడా హంద్రీ-నీవా నీటిని వదులుతామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ డీఈ వెంకటరమణారెడ్డి, జేఈలు కైలాష్, హరీష్, హథీరామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆముదంలో పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి: గరిశలపల్లిలో డీవైఎస్ఓ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ఆముదం పంటలో పంటకోత ప్రయోగాలు చేపట్టారు. గ్రామానికి చెందిన రంగారెడ్డి సర్వే నంబర్ 78-2 పొలంలో ఆముదం పంటకోత ప్రయోగాలు నిర్వహించగా 5,250 గ్రాముల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సహాయ గణాంక అధికారి డాక్టర్ లక్ష్మీనరసింహాశర్మ, ఏఈఓ ఉపేంద్రరెడ్డి, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ డివిజనల్ కోఆర్డినేటర్ చంద్ర, ఇన్సూరెన్స్ ఏజెంట్లు మంజునాథ, మహేష్, చాంద్‌బాషా, ఎంపీఈఓ రవికుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతోనే అధిక దిగుబడులు



రైతులకు సూచనలిస్తున్న ఏఓ లోకేశ్వరరెడ్డి

ఎన్పీకుంట: రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టినప్పుడే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి లోకేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని వెలిచలమల, గొకనపేట రైతు సేవ కేంద్రాల పరిధిలోని ఎస్.కె.తండా, కమ్మగుట్టపల్లి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ రసాయనిక ఎరువులను వాడటం వలన నాణ్యత లేని పంటలు పండుతాయన్నారు. భావితరాలకు మంచి నేల, మంచి ఆహారం అందించాలంటే ప్రకృతి వ్యవసాయంపైన అవగాహన పెంచుకోవాలన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు ఆయా శాఖలు అమలు చేస్తున్న పథకాలను, పాటించవలసిన పద్ధతులను వివరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో సాగుచేసిన వరి, వేరుశనగ, కంది పంటలను పరిశీలించారు.

డీజీపీని కలిసిన ఎస్పీ



డీజీపీకి బొకే అందజేస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: అనంతపురం పీటీసీలో జరిగిన డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి విచ్చేసిన డీజీపీ ద్వారకా తిరుమలరావును సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం శాంతి భద్రతల గురించి డీజీపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వేతనాలు మంజూరు చేయాలని వినతి



డాక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న 104 సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: బకాయి ఉన్న వేతనాలు మంజూరు చేయాలని 104 ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు మంగళవారం ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీ వైద్యాధికారి రవినాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమకు మూడునెలలుగా జీతాలు అందలేదన్నారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓకు జీఓ 7 ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. అరబిందో యాజమాన్యం వసూలు చేసిన పీఎఫ్‌ను చెల్లించాలన్నారు. డీఎస్సీ ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్ట్‌లో పెట్టాలని, ఇందులో పని చేస్తున్న సిబ్బందికి ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని, యాజమాన్యం నుంచి బకాయిలను త్వరగా చెల్లించేలా ప్రభుత్వ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు మోహన్‌బాబు ,డ్రైవర్ గణేష్, డీఈఓ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణతో రోగాలు దూరం

చెన్నేకొత్తపల్లి: దోమల నివారణతో రోగాలు దూరంగా ఉంటాయని వైద్య సిబ్బంది ప్రజలకు సూచించారు. వెల్దుర్తి గ్రామంలో ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీ సిబ్బంది మంగళవారం మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో గంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నివాస ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగు కాలువల్లో పూడిక ఎప్పటికప్పుడు తొలగించుకోవాలన్నారు. నీటి నిల్వతో దోమలు వృద్ధి జ్వరాలను వ్యాపింపజేస్తాయన్నారు. దోమకాటుకు గురికాకుండా ప్రజలు రాత్రి సమయంలో దోమ తెరలను వాడాలన్నారు. ధర్మవరం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జయరాం నాయక్, సిబ్బంది శ్రీనివాసులు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెక్కమానులో నీటి ఎద్దడి

గాండ్లపెంట: రెక్కమాను గ్రామంలో నెల రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. కదిరి - రాయచోటి ప్రధాన రోడ్డు పనుల విస్తరణలో భాగంగా తాగునీటి పైపులైన్లు తొలగించారు. అప్పటి నుంచి నీటి సరఫరా ఆగిపోయింది. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కిరణ్‌కుమార్‌రెడ్డిని వివరణ కోరగా రోడ్డు పనులు పూర్తయ్యాకే నూతన పైపులైను వేస్తామన్నారు. అంతవరకు ట్యాంకర్లతో నీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

అమడగూరు: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మునెప్ప తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

ఎన్పీకుంట: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆశా కార్యకర్తలు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌వర్ధన్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎమ్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ, కుష్ఠు రోగులను, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించి ఆస్పత్రికి తీసుకురావాలన్నారు. గర్భిణులకు టీకాలు క్రమం తప్పకుండా వేయించుకుంటున్నారా, మందులు వాడుతున్నారా అనే విషయాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని సూచించారు.

నేడు పుట్టపర్తిలో విద్యుత్ అంతరాయం

పుట్టపర్తి టౌన్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పుట్టపర్తి పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నారాయణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు.